కీర్తిశిఖరాలు అధిరోహించిన మహిళలు ఎందరో వున్నారు. అయితే మహోన్నత పర్వతశిఖరాలు అధిరోహించి కీర్తి సంపాదించిన వనితలు కొందరే వుంటారు. వారిలో ఇద్దరిని ప్రత్యేకంగా చెప్పుకో వాలి. ఒకరు 48 సంవత్సరాల జపాన్ వనిత జింకోతాబే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మొట్టమొదటి వనిత జింకోతాబే. రెండవ విదేశీ పోలెండ్‌కి చెందిన 44 సంవత్సరాల వండా రట్కీవిజ్.

ఇటీవలే శిఖరాలు, కీర్తిశిఖరాలు అధిరోహించిన ఈ ఇద్దరు మహిళలూ భారతదేశం వచ్చారు. "ఎవరెస్ట్ ఎప్పుడో అధిరోహించారు. మీ తర్వాతి లక్ష్యం ఏమిటి?" అని అడిగితే, "ప్రకృతి విసిరే ఏ సవాల్‌నైనా మేము స్వీకరిస్తాము. అదే మా లక్ష్యం" అన్నారు యిద్దరూ.

జింకోతాబే యిద్దరుపిల్లల తల్లి. పది సంవత్సరాల వయసులోనే క్లాస్‌టీచర్ అందించిన ఉత్తేజంతో సాహసయాత్ర ప్రారంభించి రెండువేల మీటర్ల ఎత్తువున్న రెండు శిఖరాలు అధిరోహించింది. ప్రపంచంలో ఎక్కడెక్కడ పెద్ద పెద్ద పర్వతాలు వున్నాయో, ఆ పర్వత శిఖరాలని అధిరోహించాలనే కోరికని చిన్నతనంనుంచే జింకోతాబే పెంచుకోవడం ప్రారంభించింది. 1975 మే 16 న ఎవరెస్ట్‌ని అధిరోహించి కీర్తిశిఖరాల మీద సగర్వంగా నిలబడింది.

ఇక వండా రట్కీవిజ్ పర్వతారోహణలో 'ఐరన్ లేడీ' గా ప్రసిద్ధిచెందింది. 1978 అక్టోబర్ 16 న ఎవరెస్ట్‌ని అధిరోహించి మహిళాలోకానికి ఘనకీర్తి తెచ్చింది వండా రట్కీవిజ్... పర్వతశిఖరాలని అధిరోహించి లక్ష్యం నెరవేరిందనుకుంటే చాలదు. ఇతరులతో పోటీపడి మన స్థాయి ఏమిటో తెలుసుకోవాలి. సాహసయాత్రలలో క్షణాలలో నిర్ణయాలు తీసుకోగలగాలి. పురుషులతో పోలిస్తే మహిళలు పర్వతారోహణలో యింకా వెనకబడేవున్నారు. అందుకే ఈ విషయంలో తక్కువగా మాట్లాడి, ఎక్కువ ఎత్తులు ఎక్కాలి" అని తన అభిప్రాయం వెల్లడించింది వండా రట్కీవిజ్.

ఎవరెస్ట్‌ని అధిరోహించిన మొట్టమొదటి భారతీయ మహిళ బచేంద్రిపాల్‌ని జింకోతాబే, వండా రట్కీవిజ్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఎనిమిదివేల మీటర్ల ఎత్తుగల 14 శిఖరాలని అధిరోహించాలనే లక్ష్యంతో ముందడుగు వేస్తున్న వండా రట్కీవిజ్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రురాలే కాక ఎలక్ట్రానిక్స్ ప్రత్యేక పాఠ్యాంశంగా యం.యస్‌సి డిగ్రీ కూడా స్వీకరించింది. విద్యారంగంలోనూ తాను ఎన్నో ఉన్నతశిఖరాలు అధిరోహించాలని కోరుకుంటోంది వండా రట్కీవిజ్.

—బి.కృష్ణవేణి

## విద్యార్థినుల శీర్షిక:

## చిట్టి కథ



# యుక్తి

"రేపు మనమందరం పసుపురంగు సెల్వార్ కమీజ్ వేసుకొందాం" అంది రమ క్లాసుకు నామంపెట్టి అరగంటసేపు కాంటీన్‌లో దీర్ఘసమావేశం జరిపిన తరువాత. సుజాత, విమల, జబీన్‌లు కూడా అందుకు ఏకగ్రీవంగా అంగీకరించారు. వీళ్ళు నలుగురూ కాలేజ్ విద్యార్థినులు. చదువులోనేకాక ఫాషన్లలో కూడా ఫస్టే. పైగా ఒక్కొక్కరికీ తానే నలుగురిలోకీ అందగత్తెననే అభిప్రాయం కూడా వుంది!

మర్నాడు జబీన్ కారులోంచి కాలేజ్ ముందు దిగగానే ఆమెనాకర్షించింది 'గులాబీలు గులాబీలు' అని అరుస్తున్న కుర్రాడి గొంతు. ఆమె అత్రంగా అటువెళ్ళింది. వాడి గులాబీల తట్ట చూడగానే ఆమె కళ్ళు సంతోషంగా మెరిసాయి. కారణం... ఓ రెండు డజన్ల ఎర్రగులాబీల మధ్య ఒకేఒక పసుపురంగు గులాబీ, అరవిచ్చుకొంటున్నది ఉండడమే. వెంటనే తనందరికంటే ముందు వచ్చినందుకు సంతోషిస్తూ మామూలుగా 50 పైసలిచ్చే గులాబీలకి రూపాయిపావలా యిచ్చి కొనుక్కుని అందంగా ఓ ప్రక్కకి తురుముకొని సగర్వంగా కాలేజ్‌లోకి అడుగు పెట్టింది.

తరువాత టైపింగు క్లాసు నుంచి నడుచుకొంటూ వచ్చిన రమకి కనిపించింది అదే దృశ్యం. చుట్టూ చూసి 'అమ్మయ్య మిగిలినవాళ్ళెవరూ లేరు. ఈ పసుపురోజా మ్యాచింగుగా నాకే దక్కింది. ప్రక్కింటి వాళ్ళిచ్చారు అని చెబితే పోతుంది' అనుకుంటూ అక్కడుండే 'ఒకే ఒక' రోజాని, అదే పసుపురంగు రోజాని కొనుక్కుంది.

కాలేజ్‌లోకి అడుగుపెడుతూనే జబీన్‌నిచూసి రమ ఆశ్చర్యపోయింది. 'దీనికెక్కడిదా పసుపు గులాబీ అని'. జబీనూ అంతే. వెంటనే రమ నవ్వుతూ 'మా ప్రక్కింటి పిన్నిగారిచ్చారు. వద్దని చెప్పేలోపల మా అమ్మ నా తలలో పెట్టేసింది. లేకపోతే మీకెవరికైనా ఇచ్చేదాన్ని' అంది చాలా తెలివిగా మాట్లాడుతున్నాననుకొంటూ.

జబీన్ కూడా 'మా బావ తెచ్చిచ్చాడు... సో ఐ కాన్ట్ షేర్ ఇట్ యు సీ' అంది. తరువాత వాళ్ళేదో కబుర్లు చెప్పుకొంటూండగా ఐదు నిముషాల తేడాలో సుజాత, విమలలు వచ్చారు. అవునండీ! వాళ్ళ జడల్లోనూ పసుపు రంగు గులాబీల మొగ్గలున్నాయి. అప్పటికే మరో అరడజన్ మంది పసుపురంగు గులాబీలు పెట్టుకుని వెళ్ళడం చూశారు వీళ్ళు.

ఇంక రమ ఉండబట్టలేక అడిగేసింది. 'ఎక్కడివే ఇవి' అని. విమల అమాయకంగా 'నీకు తెలీదా! బయట రోజాపూల కుర్రాడమ్ముతున్నాడు. కాని వాడిదగ్గర ఒకటే ఉందే' అంటూ అర్థోక్తితో ఆపింది.

వెంటనే నలుగురమ్మాయిలూ బయటికివెళ్ళి రోజాపూల కుర్రాడితో 'నీ దగ్గర ఒక్క పసుపు గులాబీ పువ్వే కదా వుంది, మరి ఇందరి కెలా అమ్మావు?' అన్నారు. వాడు ముసిముసిగా నవ్వుతూ "అమ్మా ఈ కాలేజీలో ఏవి తక్కువ వుంటే దానికి ఎగబడతారు. ఈ రోజు మార్కెట్‌లో పసుపు గులాబీలెక్కువ వచ్చాయి. అన్నీ బయట పెట్టానంటే ఎవరికీ ఆశ ఉండదు. ఎర్రరోజా పువ్వులైతే గుడి ముందరైనా అమ్ముడుపోతాయి. పసుపువి అలా కాదు. అందుకని ఒక్కొక్కటిగా పెడుతున్నాను. దూరంగా ఇద్దరొస్తున్నారనుకోండి, రెండు తీసిపెడతాను చూడండి" అని తట్ట ఎత్తి చూపించాడు. కింద బుట్టలో ఓ డజన్ పసుపు గులాబీలు తడిబట్టలో చుట్టిఉన్నాయి.

వాడి తెలివికి నోట మాటరాక అలాగే నిలబడిపోయారు మన అమ్మాయిలు!

—వి.సుచిత్రామౌళి

(రిసెర్చి స్కాలర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్-బెంగళూరు)